# 23. మార్గదర్శని

సోమయ్యను కలుసుకున్నందుకు ఎంతో సంతోషంగా వుంది. సోమయ్య నా ముఖ్యస్నేహితుడని కాదుకాని, ఎవర్నీ ఎరుగని యీ పట్టణంలో ఒంటరిగా గడపటం ఎలాగా అన్న నా సమస్య అతని వల్ల తీరిందని.

సాయింత్రం దాకా ఊరంతా కలిసి తిరిగారు. చీకటి పడబొయ్యే వేళకల్లా "నాకో పది రూపాయలు అప్పిస్తావా?" అని అడిగాడు సోమయ్య.

యీ పదిగంటల్లోనూ సోమయ్యకూ నాకూ పదిసంవత్సరాల కాలంలో ఎంత స్నేహం పెరిగేందుకు అవకాశం వుందో అంతా పెరిగిందనే చెప్పాలి. ఇక పైకం విషయం, సోమయ్యకు అప్పు ఇవ్వాల్సిన అవసరం నాకు కనిపించలేదు. అతనికి ధర్మంగా కాకపోయినా స్నేహధర్మంలో ఏ విధమైన ప్రతిఫలాన్నీ కోరకుండానే ఇస్తేమాత్రమేం అనిపించింది. కాని అతనికి పదిరూపాయలు ఎందుకో అర్థమైంది కాదు.

"ఎందుకూ?" అన్నాను.

"కావాలి" అని తప్పించుకో బొయ్యాడు. ఆ కంఠస్వరమూ, అతని ప్రవర్తనలో కనిపించే మార్పు నాకు మరింత అనుమానాన్ని కలిగించినయ్.

"కాదు చెప్పి తీరాలి. చెప్పవా?"

మరో మార్గంలేక అతను ఆ రహస్యాన్ని బైట పెట్టాడు.

"యీ రాత్రికి ఒకామె దగ్గరికి పోవాలి."

"మరి నే నెక్కడ పడుకునేదీ?"

"నువ్వూ ఆ ఇంట్లోనే పడుకోవచ్చు."

నన్ను విడిచి ఉండడుకదాననే ధైర్యం కలిగింది. అతనికి పదిరూపాయిలూ ఇచ్చేశాను. అంతకుముందే పెద్ద ఆస్తి నా స్వాధీనమైంది. నేను కష్టపడి సంపాయించింది కాదు కనుక డబ్బు విలువ నాకేం అర్థం కాని రోజులవి.

సోమయ్య ఆమెతో కాలాన్ని గడపటాన్ని గూర్చి ఆలోచిస్తున్నాను. నన్ను ఒంటరిగా మంచానికి అప్పగించి అతనొక్కడూ సుఖిస్తాడు కాబోలు! ఆడదాన్ని ఎరుగని నా అనుభవం నేనింతవరకూ ఎదుర్కోని కామోద్రేకం నాలో బైలుదేరింది. కాని ఆ సంగతి బైటపెట్టేందుకు ఒక రకం సిగ్గు నన్ను ఆవరించింది; ఆటంక పరిచింది.

సోమయ్యతో కలిసి 'ఆమె' ఇంటికి వెళ్ళాను. అపరిచిత స్థలమైనా ఆమె సోమయ్యను ఆహ్వానించిన విధానం చూస్తే నాక్కూడా ఎంతో పరిచయమున్న ప్రదేశంగానే తోచింది. శుభ్రంగా చక్కగా అలంకరించబడ్డ గదిని చూస్తే నీచాభిప్రాయానికే తావులేకుండా వుంది. ఆమెకు పాతికేళ్ళుంటయ్. నాకన్న ఏడెనిమిదేళ్ళు పెద్దదైనా ఎంతో అందంగా ఆకర్షణీయంగా వుంది. పురుషత్వాన్ని ఆహ్వానించగల ఆమెముఖం, చిలిపిగా అల్లరిగావున్న ఆమె కళ్ళూ, మధురమైన చిరునవ్వు మొత్తంమీద ఆమె నన్ను మొదటి చూపులోనే బోల్తా కొట్టించ గలిగిందని చెప్పక తప్పదు. అందులోనూ ఆమె పెద్ద వంశానికి చెందిన పడుచని తెలిసినట్టయితే ఆమెలో నేనింత ఆకర్షణను చూడలేక పొయ్యేవాణ్ని! కాని ఆమె సోమయ్యలాటి యువకుణ్ని డబ్బుకోసం ఆహ్వానించే ఆడదని నాకు ఇంతకుపూర్వమే తెలిసి ఉండటంవల్ల నాలోని 'కోర్కె' బీజం క్షణాల్లో వృక్షరూపందాల్చి ఊడలుకూడా దింపుకు కూర్చుంది.

"ఆయనెవరూ?" అంది నన్ను చూపుతూ. యీ ప్రశ్న ఆమె చాటుగా అడిగి ఉండాల్సింది. కాని ఆమె నాపట్ల తీసుకున్న యీ స్వాతంత్ర్యానికి నాకెంతో సంతోషమైంది.

"మా తమ్ముడులే!" అన్నాడు సోమయ్య. ఆమెతో నాకీ బంధుత్వం నన్ను మరింత దగ్గరికి నెట్టేందుకు ప్రయత్నించటం వల్ల సోమయ్యగాణ్ని లోలోపల ఎంతో మెచ్చుకున్నాను.

"అబ్బో! మరిదిగారా!" అంది నవ్వుతూ.

వీళ్ళు డబ్బు కోసమే అవుగాక మగవాణ్ని ఎంతగా సంతోషపెట్టేందుకు ప్రయత్నిస్తారు! భార్యల దగ్గర యీ ఆనందం లేకనే కాబోలు ఇంతమంది భర్తలు యీ బజారుల్లో చీకట్లో తమకు కావలసిన దానికోసం వెతుక్కుంటూ తారట్లాడటం!

ఆమె లోపలికి వెళ్ళింది. ఇలాటి స్త్రీతో నేనే ఒక రాత్రి గడుపుతే బాగుండు ననిపించింది. నా దగ్గర పదిరూపాయిలు అరువుతీసుకున్న సోమయ్యే ఇలాటి ఆనందంకోసం వొస్తే - వందపదులు జేబులోవున్న నాకది కరువవటం బాధగానే వుంది. యీసంగతి సోమయ్యకు తెలియపరిచేందుకు మొదట్లో ఎంతో భయపడ్డాను-

ఆమె కాఫీ తెప్పించి ఇచ్చింది. ఎంతసేవ! పూట పూటకూ ఆమె యీ విధంగా నటిస్తే మాత్రం!- ఆ కాస్సేపూ ఆ వలలో చిక్కుకొని మోసపోతే మాత్రమేం - ఆ మత్తులో ఎన్ని బాధలైనా ఇట్టే మరిచిపోవొచ్చు!

ఇక ఆగలేక సోమయ్యతో నా మనసులోని మాట బైట పెట్టేశాను. అతను నవ్వుతూ ఆమెను అవతలికి తీసుకెళ్ళి ఏదో రహస్యంగా వూదాడు.

ఒంటరిగా - ఆమె లేకుండా కూర్చోవటం ఎంతో బాధగావుంది. పావుగంటసేపు ఇద్దరూ గుసగుసలాడారు. తరువాత ఇద్దరూ రంగంమీద ప్రవేశించినప్పుడు ఆమె ముఖంలో ఇంతకుపూర్వం చూసిన కళ క్షీణించింది. సోమయ్య మాత్రం ఏదో బలవంతంగా నవ్వుతూ, “సరే నేను వెళ్తున్నాను. పొద్దున్నే వొస్తాలే-” అని నా జవాబు క్కూడా ఎదురు చూడకుండా వెళ్ళిపొయ్యాడు.

అనుభవమే లేని నాకు ఇప్పుడు ఆమె ఒక సమస్యగా ఎదురైంది. ఒక రకం సిగ్గూ ఇంకో రకం భయమూ నన్ను ఆవరించినవి. ఏం మాట్లాడాలో తెలియక కొట్టుకుంటూన్న నా సమస్యను ఆమె తీర్చగలిగింది.

“భోంచేశారా?” అంది

“లేదు...”

“ఐతే ఇక్కడ భోంచేద్దురుగాని-”

ఆమెతోపాటు భోంచేసేందుకు నా కేమీ అభ్యంతరం లేదు. అది నాకు మరింత ఆనందాన్నిచ్చింది.

ఎంతో ఆప్యాయంగా దగ్గరుండి వొడ్డించింది. జన్మలో ఎరగనంత తృప్తితో నా చేత తినిపించింది.

మళ్ళీ ఆ పడకగదీ ఆమెతోపాటు నేనూ, మాకోసం ఎదురుచూసే మంచమూ సిద్ధమయినవి. ఆ సంఘటనలో మాత్రం నాకు ఇంకా కొంత బెరుకు ఉన్నది కాని, నా ఉద్రేకం కట్టలు తెంచుకోవటం వల్ల ఆ ప్రకృతి శాసనమే నాకు మార్గదర్శిని అయింది.

ఆమె నాపక్కనే కూర్చుని తాంబూలాన్ని అందించింది. ఆమెను ముట్టుకున్నంత మాత్రానే ఎంతో తృప్తి కలిగి ఉద్రిక్తున్నవుతున్నాను. మైకంగా, సువాసనల్ని పీలుస్తూ భూమి మీదనుంచి ఆకాశంలోకే ఎగురుతున్నా నేమో ననిపిస్తోంది.

"సోమయ్యగారు మీకు ఏమౌతారు?" అంది.

"స్నేహితుడు."

"ఎందుకు అలాటి వారితో తిరుగుతారూ?"

"ఏం?"

"మీకు పెళ్ళయిందా?"

"లేదు."

"ఏం లేదు...చెడిపోతారని...."

"నీ దగ్గరికి రావటంలో చెరుపేమీ నాకు కనిపించటం లేదు-"

ఆమె మాట్లాడకుండా జాలిగా నా ముఖంలోకి చూసింది.

ఇలాటి నిరుత్సాహమైన సంభాషణను నేను యీ ప్రదేశంలో కోరలేదు. అందుకని ఆమెను కళ్ళతోనే గదమాయించాలని చూసాను. నేను కొనుక్కున్న వస్తువుమీద నాకెలాటి అధికారం ఉంటుందో అలాటి అధికారాలే యీ క్షణంలో ఆమె మీద ఉంటవనే ఒక నమ్మకం కుదిరిపోయింది.

ఇక మాటల్తో కాలాన్ని వృథా చేయదలచలేదు. ఆమె భుజం మీద చెయ్యివేసి దగ్గరకు లాక్కున్నాను. ఆమె ఇట్టే లొంగిపోతుందనీ ఎటుతిప్పుతే అటు తిరిగే కీలుబొమ్మేననీ నా నిశ్చితాభిప్రాయం. కాని నాదంతా ఒక భ్రమేనని తెలుసుకునేందుకు ఎక్కువసేపు పట్టలేదు. ఆమె ఎలక్ట్రిక్ షాక్ తిన్నట్టుగా విదిలించుకొని దూరంగా జరిగింది. యీ రకంగా ఎదురు తిరగటంలో నేను అభిమానాన్ని మాత్రమే కోల్పోయివుంటే బాధపడేవాణ్ని కాదు. యజమాని ఆజ్ఞను తిరస్కరించే సేవకురాలు యజమానికి కలిగించే బాధకు తోడు డిసప్పాయింట్‌మెంట్ కూడా కలిసి ఒకవిధమైన విషాదానికి దారితీయటమల్లే వుంది!

ఐతే ఆమె సేవకురాలుగానీ, కనీసం నేను కొనుక్కున్న వస్తువు కానీ కాదని వెంటనే గుర్తుకొచ్చింది. ఆమెకూడా మనిషేననీ ఉద్రేకానికీ కామమోహావేశాలకూ లొంగిపొయ్యే సామాన్య మానవయువతనీ తెలుసుకోలేకపోలేదు. ఏమైనా ఆమె అభిప్రాయం ఏమిటో, నన్ను నిరాకరించినట్లు సూచించే ప్రవర్తనకు అర్థం ఏమిటో అంతుపట్టలేదు.

"ఏమిటీ!" అన్నాను, ఆశ్చర్యంతో కలిసిన కోపంతో.

"ఏం లేదు" అని మూతి ముడుచుకుంది.

"కోపమా?"

"ఉహూఁ."

"మరి?"

"ఏం లేదనటంలా" అని విసిరికొట్టినట్టు చెప్పింది.

"నేను వెళ్ళిపొయ్యేదా?" అన్నాను కోపాన్ని నటిస్తూ, కాని నన్ను వెళ్ళి పొమ్మంటుందేమోననే దిగులు లేకపోలేదు.

"యీ అర్ధరాత్రి ఎక్కడికి వెళ్తారూ? పడుకోండి."

"నువ్వూ రా."

ఆమె ఎంతో అయిష్టంతో పడుకుంది. నేను ఆమెపట్ల చూపే ప్రవర్తన - పురుషుడు స్త్రీపట్ల ప్రకటించే కామోద్రిక్తత - ఆమెకు ఏవగింపును కలిగిస్తూన్నది. ఏం చేయను? యీ మనిషి తత్వమే ఇంతా?

"నీ సంగతి నాకు అంతుపట్టలేదు."

"మీరెందుకు బాధపడతారు - పడుకోండి. యీ విధంగా తిరిగి చెడిపోతారు."

"ఇదివరకు నేనిలా తిరగలేదని నీకెల్లా తెలుసు?"

"అంతా సోమయ్యగారు చెప్పారులెండి."

"సరే...నా సంగతి అనవసరం. అదీకాక నేను నీతో సుఖించేందుకు వొచ్చానుకాని, నీదగ్గర నీతిబోధల్ని పొందేందుకు మాత్రం కాదని గుర్తుంచుకో."

"మీరు ఎందుకొచ్చినా సరేకాని నేను మాత్రం దీనికి ఒప్పుకోను."

యీ వింత ప్రవర్తన నాకెంతో కోపాన్ని తెప్పించింది.

"నీకు కావలిసింది డబ్బు. ఆ డబ్బు నేను ఇస్తాను. అంతకు మించిన దేమీ నీకు అక్కర్లేదు."

"నేను కాదనను, కాని మీపట్ల ఇలాంటి అపచారం చేసేందుకు నా మనసు ఒప్పటంలేదు. ఒకసారి యీ గోతిలో పడ్డారో మీ జీవితమంతా పాడుచేసుకున్నట్టే!"

"అవన్నీ కట్టిపెట్టు" నాకో పెద్ద అనుమానం కలిగింది. "నేనంటే నీకు ఇష్టంలేదా? ముందు ఆ మాట చెప్పు."

"ఇష్టం లేక కాదు. ఇష్టం ఉండబట్టే యీవిధంగా బతిమాలుతున్నాను. మొదట్లో నేను ఒప్పుకోలేదు. కాని నేను ఒప్పుకోక పోయినట్టయితే మీరు ఇలాటిదే ఇంకో కొంపకు వెళ్తారనీ, ఆ రంకులాడి మిమ్మ్మ తప్పకుండా పాడుచేస్తుందనీ ఆలోచించే చివరకు ఒప్పుకున్నాను."

"ఒప్పుకొని నన్నీవిధంగా బాధపెట్టా లనుకొన్నావు అవునా?"

"నా పక్కనే పడుకొని కబుర్లు చెప్పండి."

"ఎట్లా గడుస్తుంది?"

కొంతవరకూ దార్లోకి వొచ్చిందికదానని సంతోషించాను. ఆమె పక్కనే పడుకొని ఏం మాట్లాడాలో తోచక ఎలాగైనా ఆమె బోధించే నీతిమార్గాల్ని మరిపించే ప్రయత్నంలోవున్నా. ఎంతచేసినా ఆమెలో కదలిక వున్నట్టు తోచటంలేదు. ఒకవేళ ఉండికూడా ప్రదర్శిస్తే నేను 'చెడిపోతాను' అని ఊరుకుందేమో?

వొట్టిమంచంమీద పడుకున్నా కొంతవరకూ నిద్రపట్టే అవకాశం ఉండేది. కాని ఒక యువతి పక్కన చలనం లేకుండా అన్ని ఉద్రేకాలనూ ఆవేశాలనూ తొక్కిపట్టి పడుకోగలగటం నాకు అసాధ్యమే అయింది. ఆమె దూరంగా వున్నా కొంతవరకూ నిగ్రహించుకో గలిగేవాణ్ని. కామోద్రేకాన్ని రెచ్చగొట్టే ముఖ్యమైన మూడుభూతాలూ పని చేస్తున్నవి. దృష్టి, వాసన, స్పర్శ యీ జ్ఞానాల తాకిడి లేకుండా పొయ్యేందుకు నేనేమన్నా కట్టెనా?

రాత్రి గడుస్తూన్న కొద్దీ నా బాధ విపరీతమైంది. అసలు ఆనందం తప్ప మిగతాదంతా జరుగుతూనే వుందికాని ఇట్లా ఎంతసేపు? ఆమె నన్నీ విధంగా బాధపెడుతుందని తెలుస్తే అసలు ఏ సత్రంలోనో యీ రాత్రి గడిపేవాణ్ని.

బతిమాలాను. భంగపడ్డాను. ప్రార్థించాను. బెదిరించాను – లాభం లేకపోయింది. చివరకు ఆమెను బాధించసాగాను – నా బాధనన్నా, నా ఉద్రేకాన్నన్నా తెలుసుకుంటుందేమోనని! ఆమె బుగ్గలు కొరికాను. గోళ్ళతో మొహమంతా రక్కాను. వీపుమీద గుద్దాను. పాపం ఎదురుచెప్పలేదు. అంత బాధనూ భరించింది. అంతేకాని ఆమె చలించలేదు. బలవంతం చేశాను. కాని లాభం లేకపోయింది. ఇష్టం లేకపోయిన ఆడదాన్ని అనుభవించ గలగటం ఎలాగో అర్థం కాలేదు. చివరకు అలసిపోయి నా చేతకానితనం నాలో కలిగించిన యీ కొత్తబాధనుకూడా భరిస్తూ ఏడ్వసాగాను.

నన్నామె ఊరడించింది. పెరిగిన నా అసంతృప్తికి మాత్రం సానుభూతి చూపింది. ఆమె ఆడదేనా? మనిషేనా?

"ఇవన్నీ దేనికి? నాకెంత బాధగా వుందో తెలుసా?" అన్నాను.

"కానీండి. యీ ఒక్క రాత్రేగా!" అంది.

నేనేం మాట్లాడేది? నాకు నిద్రకావాలని కాబోలు చిచ్చికొడుతోంది. ఉపచారాలు నన్నింకా బాధిస్తాయని ఆమె తెలుసుకోలేకపోయిం దనుకుంటాను.

"ఇంత ఉద్రేకం ఉన్నవాళ్ళు పెళ్ళి చేసుకోకూడదా?" అంది.

శృంగభంగానికితోడు యీ నీతిబోధలు నాకు మరింత బాధగా ఉన్నవి.

"నోరుముయ్" అని తన్నాను.

ఆ విధంగా ఆ రాత్రంతా విషాదంతో గడిచిపోయింది. రాత్రి నేనెంత రాక్షసత్వాన్ని ప్రదర్శించానో ఆమెను చూస్తే అర్థమైంది. ముఖంనిండా గాట్లు, రక్కులు స్పష్టంగా కనిపిస్తూన్నవి. ఇక అక్కడ ఉండబుద్ధి కాలేదు.

"సరే నేను వెళ్తున్నాను. నా గురించి రాత్రి నువ్వు పడ్డ శ్రమకు యీ వంద రూపాయిలూ తీసుకో" అన్నాను.

"నేనుపడ్డ శ్రమను మీరు డబ్బురూపాన కొలుస్తారనుకోలేదు. నేనెంతో ఉపచారమే చేద్దామనుకున్నాను."

"కాని అపకారమే చేశావుగా!"

"అని మీరు అనుకుంటున్నారు... ఒక్కటి ఆలోచించండి. ఇప్పుడు మీ శరీరంలో ప్రవేశించే అనేక రకాల విషాలు – మీ ఒక్కరితోనే పోవు. మీరు చేసిన యీ నేరానికి, లేక మీరు పొందిన ఆ క్షణిక ఆనందానికి వెలగా ఆ బాధను మీ రొక్కరేకాక రేపు మీ భార్యకూడా అనుభవించవలసి వుంటుంది. అంతేకాదు...మీ వంశంలోని తరువాతి తరం వాళ్ళుకూడా..."

అంతా అర్థమైంది, ఉద్రేకమంతా జారిపొయ్యాక కూడా అర్థం కాకుండా వుంటుందా? ఆమె చేసిన సేవకు ఏ విధంగా కృతజ్ఞత చూపాలో తెలియలేదు. ఆ దేవత ముందు నిలబడలేని బలహీనతను ఎదుర్కోలేక ఆ ప్రదేశం నుంచి వెంటనే బైటపడ్డాను.

అంతే. ఆ మార్గదర్శకురాల్ని మళ్ళీ జీవితంలో కలుసుకో దలచలేదు. జీవితమంతకూ సరిపడే 'డోస్'ను ఆమె నాకు యివ్వగలిగిం తర్వాత ఆ అవసరం ఏముంది కనుక?

– *ఏప్రిల్, 1949*